క్లుప్తంగా

పశువులకు వ్యాక్సినేషన్



మురపాకలో పశువులకు టీకాలు వేస్తున్న పశు సంవర్ధకశాఖ సిబ్బంది

గంట్యాడ: మండలంలోని పెదమజ్జిపాలెం, మురపాక గ్రామాల్లో పశువులకు పశుసంవర్ధక శాఖ సిబ్బంది సోమవారం లికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పశుపోషణలో పాటించాల్సిన జాగ్రత్తలపై పాడిరైతులకు సూచనలు చేశా రు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ ఏడీ రెడ్డి కృష్ణ పరిశీలించారు. పాడి రైతులంతా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు.

ఎమ్మెల్సీ బొత్సకు శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ బొత్సను కలిసిన వేపాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు

వేపాడ: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను వేపాడ మండల వైఎస్సార్‌సీపీ నాయకులు విశాఖలో సోమ వారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొత్సను కలిసిన వారిలో నాయకులు వంటాకు భాస్కర్, ఆదపురెడ్డి ముత్యాలునాయుడు, మిరపాక రమణ, బోజంకి నారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



వరప్రసాద్

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ఉన్నత పాఠశాల విద్యార్థి వెదురుపర్తి వరప్రసాద్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడని హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతిలో 565 మార్కులు సాధించిన వరప్రసాద్ మూడో విడతలో భర్తీ చేసిన సీట్లలో ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి అర్హత సాధించాడన్నారు. తమ పాఠశాలలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకె వేర్వేరు ఐఐఐటీల్లో సీట్లు సాధించడం ఆనందంగా ఉందన్నారు.

వరుణుడి కరుణ కోసం పూజలు



గంగమ్మకు పూజలు చేసేందుకు బిందెలతో నీటిని తెచ్చిన మహిళలు

బొండపల్లి: వరుణ దేవుడు కరుణించి వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకుంటూ మండలంలోని గిట్టుపల్లి గ్రామస్తులు సోమవారం పూజలు చేశారు. ప్రతీ ఇంటి నుంచి మహిళలు పసుపు, కుంకుమ కలిపిన నీటిని బిందెలతో రామాలయానికి తీసుకుని వచ్చి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. వర్షాలు లే క వరినాట్లు ఎండిపోతున్నాయని, వరుణ దేవుడి అనుగ్రహం కోసం పూజలు చేశామని గ్రామస్తులు తెలిపారు.

మదర్ థెరిసా జయంతి వేడుకలు



మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కూటమి నాయకులు

కొత్తవలస: మదర్ థెరిసా జయంతి వేడుకలను ఎన్డీయే కూటమి నాయకులు మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని మదర్ థెరిసా విగ్రహానికి నియోజకవర్గ జనసే న పార్టీ ఇన్‌చార్జి వబ్బిన సత్యనారాయణ , టీడీపీ నాయకులు సత్యనారాయణ, కనకాల శివ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మదర్ థెరిసా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని అన్నారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు.

ఆర్థిక సహాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రానికి చెందిన రంభ అప్పారావు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం స్థానిక గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు రూ.10,700 సహాయం చేశారు. ట్రస్టు సభ్యులు సోమ వారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి, నగదు అందజేశారు.ట్రస్టు సభ్యులకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



రాత్రి వేళల్లో రక్షణ అవసరం

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రి సమయాల్లో విధులు నిర్వర్తించే మహిళా వైద్యులు, స్టాఫ్‌నర్సులకు రక్షణ చాలా అవసరం. పగలు సిబ్బంది అంతా ఉంటారు కాబట్టి పరవాలేదు. కానీ రాత్రి సమయాల్లో అందరికీ విధులు ఉండవు. కొద్దిమంది మహిళా సిబ్బందే విధుల్లో ఉంటారు. ఆ సమయాల్లో రోగుల వెంట వచ్చే సహాయకుల్లో కొంతమంది మద్యం తాగి ఉంటారు. వారు అనవసరంగా సిబ్బందితో గొడవకు దిగుతుంటారు. చాలాసార్లు భయాందోళనకు గురైన సంఘటనలు ఉన్నాయి. అందుకే రాత్రి సమయాల్లో మహిళా సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా లో వైద్యురాలిని హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలి. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి

– రమణి, స్టాఫ్‌నర్స్, మెరకముడిదాం పీహెచ్‌సీ





సెక్యూరిటీ గార్డులను నియమించాలి

ఆస్పత్రిలో పని చేసే సిబ్బందిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. ఆస్పత్రి జనావాసాలకు దూరంగా పొలాల మధ్య ఉంది. సెక్యూరిటీ గార్డులను నియమించి స్టాఫ్‌కు రక్షణ కల్పించాలి. విశ్రాంతి తీసుకోవడానికి ప్రత్యేక గదులు నిర్మించాలి. వైద్య సిబ్బందితో దురుసుగా ప్రవర్తించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగికదాడికి పాల్పడి, హత్య చేసిన నిందితులను శిక్షించాలి. అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. వైద్య సిబ్బందికి భద్రత కల్పిస్తేనే వారు తమ విధులకు న్యాయం చేయగలరు.

– కె.రత్నం, హెల్త్ సూపర్ వైజర్, కె.కొత్తవలస పీహెచ్‌సీ

జయ కృష్ణా ముకుందా మురారీ

ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మ ప్రకారం నడుచుకోవాలని లోకానికి చాటిచెప్పిన శ్రీకృష్ణ పరమాత్ముడు సర్వ మానవాళికి ఆదర్శప్రాయుడు. అటువంటి దేవదేవుడి జన్మాష్టమిని సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తల్లిదండ్రులు తమ చిన్నారులను రాధాకృష్ణులుగా అలంకరించి..ఆ దేవుడే తమ ఇంట సందడి చేస్తున్నాడని సంబరపడిపోయారు. పలుగ్రామాల్లో అన్నదానం చేశారు. సాయంత్రం శ్రీకృష్ణుడి విగ్రహాలను ఊరేగించడంతో పాటు ఉట్టి కొట్టే సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాల్లో యువత సందడి చేశారు.పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మహిళల కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్ వర్క్



కొత్తవలస: చింతలపాలెం గ్రామంలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణపరమాత్ముడు



మెరకముడిదాం: మెరకముడిదాం సన్‌రైజ్ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు



బొండపల్లి: బొండపల్లిలో గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



జామి: జామిలో పూజలందుకుంటున్న శ్రీకృష్ణుడు



దత్తిరాజేరు: పెదకాదలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న యాదవులు



జామి: నారాయణపురంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు



వేపాడ: బక్కునాయుడిపేట ఆలయంలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



వేపాడ: వేపాడ విక్టరీ హైస్కూల్‌లో ఉట్టికొడుతున్న విద్యార్థులు



లక్కవరపుకోట: రంగరాయపురంలో పూజలందుకుంటున్న స్వామివారు



జామి: నారాయణపురంలో మహిళల కోలాటం



కొత్తవలస: మంగళపాలెంలోని గురుదేవ చారిటబుల్ ట్రస్టులో గోపికలు, శ్రీకృష్ణ వేషధారణ చిన్నారులతో ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు



శృంగవరపుకోట: శ్రీరవితేజ పాఠశాలలో గోపికలు, కృష్ణుడి వేషధారణలో విద్యార్థులు



వేపాడ: వేపాడ గోపాలకృష్ణ ఆలయంలో ఉట్టి కొడుతున్న చిన్నారులు



శృంగవరపుకోట: శ్రీగౌరీ విద్యానికేతన్ పాఠశాలలో కృష్ణాష్టమి సంబరాలు

మట్టి గణపతినే పూజిద్దాం



మట్టి వినాయక విగ్రహాలను ప్రదర్శిస్తున్న ఆశయ, నవభారత్ సంస్థల ప్రతినిధులు

చీపురుపల్లి: వినాయక చవితి పండగను పురస్కరించుకుని మట్టి గణపతినే పూజించాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ కోరారు. పట్టణంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఆశయ యూత్ అసోసియేషన్, నవభారత్ ఫౌండేషన్ సంయుక్తంగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఏటా వినాయక చవితికి మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.నవ భారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు యు.హరి, సంస్థ ప్రతినిధులు టి.త్రినాథ్, జి.శ్రీను, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లొట్లపల్లి సంతకు లైసెన్స్ ఇవ్వొద్దు



మాట్లాడుతున్న గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రామృష్ణ

జామి: లొట్లపల్లిలో పశువుల సంతలో మౌలిక సదుపాయాలు లేవని, సంత నిర్వహణకు అధికారులు లైసెన్స్ ఇవ్వొద్దని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలో గోసంరక్షణ సమాఖ్య సభ్యులతో కలిసి సోమ వారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతలో సదుపాయాలను పరిశీలించామని, సంత నిర్వహణకు లైసెన్స్ ఇచ్చే పరిస్థితి లేదని అన్నారు. మౌలిక సదుపాయాలు మెరుగుపరచకుండా అధికారులు లైసెన్స్ మంజూరు చేస్తే పోరాటం చేస్తామని చెప్పారు. త్వరలో కలెక్టర్,ఎస్పీని కలిసి జిల్లాలోని అన్ని సంతల్లో అధికారులతో తనిఖీలు చేయించాలని కోరనున్నామని తెలిపారు. గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి రూపావతి, కె.వి.ఆర్.సత్యనారాయణ, జి.శాంతి,లీలాపు దేవి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు



శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న శారద కర్మాగార ప్రతినిధులు

కొత్తవలస:

కంటకాపల్లి శారద మెటల్స్, ఎల్లాయిస్ కర్మాగారం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ కోర్సుల్లో 42 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారికి కంపెనీ ఏజీఎం మనోజ్‌కుమార్ ఆచార్య, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మదినా అప్పలరాము సోమవారం సర్టిఫి కెట్‌లు అందజేశారు. ఈసందర్భంగా మనోజ్‌కుమార్ ఆచార్య మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నామని, సద్వినియోగించుకోవాలని సూచించారు. కర్మాగార ప్రతినిధులు గుల్లిపల్లి శంకరరావు, కె.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: పెదమానాపురం రహదారిపై ఎస్‌ఐ జయంతి పోలీస్ సిబ్బందితో కలిసి సోమవా రం వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన పత్రాలు, లైసెన్స్ లు పరిశీలించారు. వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించా రు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అనుమతుల్లేకుండా విక్రయాలు తగదు..

డెంకాడ: అనుమతుల్లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని అయినాడ జంక్షన్, జొన్నాడ ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి, గుట్కాలు వంటి నిషేధిత పదార్థాలను విక్రయించినా , రవాణా చేసినా.. మందుగుండు విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన చర్యలు తప్పవన్నారు. అనంతరం నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ చలాన్‌లు విధించారు.

ఎక్కడి పనులు అక్కడే..!

- బిళ్లలవలస– చీపురుపల్లి రోడ్డు విస్తరణ పనులు పూర్తయ్యేదెప్పుడో..?
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ.8.76 కోట్లతో పనులు మంజూరు
- 15 కిలోమీటర్ల మేర చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ
- 11 కల్వర్టుల నిర్మాణం పూర్తి
- ఎన్నికల కోడ్ రావడంతో అర్ధంతరంగా నిలిచిన పనులు
- కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులకు పూర్తిగా బ్రేక్



బిళ్లలవలస- చీపురుపల్లి రోడ్డులో ఓ చోట మెటల్ వేసి తారువేయకుండా వదిలేసిన దృశ్యం

మెరకముడిదాం: మండలంలోని గర్భాం, గరివిడి ప్రధానరహదారి నుంచి బిళ్లలవలస, గరివిడి మండలం వెదుల్లవలస మీదుగా నియోజక వర్గం కేంద్రం చీపురు పల్లికి వెళ్లే రోడ్డు విస్తరణ, పునరుద్ధరణ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న తీరుగా మారాయి. రోడ్డు ఎక్కడక్కడే గోతులు తేలి అధ్వానంగా తయా రు కావడంతో రాకపో కలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నామని, మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి నియోజకవర్గ, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించారు. రోడ్డు విస్తరణ,పునరుద్ధరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం క్రింద 14.095 కిలోమీటర్ల మేర రోడ్డు పనుల కు అప్పట్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.8.76 కోట్లు మంజూరు చేశాయి. ఈఏడాది ఫిబ్రవరిలో నిధులు మంజూరు కాగానే సంబంధిత కాంట్రాక్టర్ పను లు ప్రారంభించారు. కొద్దిరోజుల్లోనే ఈ రహదారిలో పలు గ్రామాల వద్ద 11 చోట్ల కల్వర్టులను నిర్మించారు, అలాగే కొన్నిచోట్ల రోడ్డును తవ్వి మెటల్ వేశారు. ఈపను లు పూర్తయ్యేసరికి ప్రభుత్వం మొదటి విడత బిల్లుగా సుమారు రూ.80 లక్షలు చెల్లించింది. ఇంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో మిగిలిన బిల్లుల చెల్లింపు ప్రక్రియ నిలిచిపోవడంతో పనులు ముందుకు సాగలేదు.

పూర్తిగా విస్మరించిన కూటమి ప్రభుత్వం

ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు పనులను పూర్తిగా విస్మరించారు. గత ప్రభుత్వంలో రోడ్డు విస్తరణ, పునరుద్ధరణ పనులు ప్రారంభం కావడంతో ఇక ఇబ్బందులుండవని భావించిన ఆ మార్గంలో ప్రయాణించే 16 గ్రామాల ప్రజల ఆశలపై కూటమి సర్కారు నీళ్లుచల్లింది. రోడ్డు పనులను ముందుకు తీసుకువెళ్లే విషయంలో ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో ప్రయాణికులు మండిపడుతున్నారు. రోడ్డు పనుల్లో భాగంగా ఎక్కడికక్కడ తవ్వేసి, మెట ల్ వేసి వదిలేయడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించేలా చూడాలని, పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆ రోడ్డు మార్గంలోని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పనుల్లో భాగంగా బిళ్లలవలసలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కల్వర్టు